జానికి సహాయం చెయ్యవలసిందనీ ఉత్తరం రాసింది. చివరకు, ఇతడు చేసిన పని ఇది," అన్నాడు వెంకట రామయ్య.

ఈ మాటలలో ఎన్ని వినిపించాయో, ఎన్ని వినిపించలేదోగాని రామారావు నిలుచున్నట్టు కూలబడ్డాడు. అతని చేతిలోవున్న లక్షరూపా యల కవరు క్రిందపడింది. వెంకటరామయ్య ఆ కవరును ఆప్యా యంగా తీసుకొని, "లక్ష రూపాయలు ఉన్నాయో లేవో చూసి, మా ఖాతాలో జమ కట్టించండి" అని ఏజెంటు చేతికి యిచ్చాడు.

---

# 21. రిక్షావాలా

చేసిన పాపం చెపితే పోతుందంటారు. చెప్పినంత మాత్రాన పోతుందా? మనస్ఫూర్తిగా పశ్చాత్తాప పడి, ఇహ మళ్ళా జన్మలో చెయ్యననే నిశ్చయానికి వచ్చి యేడుస్తూ చెప్పినప్పు డేమన్నా పోతుందేమో

నేను చేసిన పాపం, అంతులేనిది. ఆ పాపాన్నించి నాకు ముక్తి ఉంటుందని నేను అనుకోను. అయినా అనుభవించవలసిందే! అసలు సంగతికి వద్దాం.

చీకటి పడుతోంది. మనిషి మొహం కనపడీ కనపడనట్టుగా ఉంది వెలుతురు. ఎక్వేరియం రెస్టరెంటులో, నా సహాధ్యాయిని శాంతతో కూడా టిఫిను తిని బయటికి వచ్చాను.

"ఎక్కడికి పోదాం " అంది శాంత.

"చెప్పు నువ్వే."

"మీ గదికి పోదాం పద. ఇవ్వాళకి తిరిగింది చాలు. చదవాల్సి నది బోలెడు ఉంది."

"అలాగే."

నా గది జార్జిటౌనులో ఉంది; సుంకురామచెట్టి వీధిలో. అంత దూరం పోవాలంటే నడవటం సుకుమారుల పనిగాదు.

"ఏయ్ రిక్షా!"

అక్కడ సమీపంలోనే వున్నాడు రిక్షావాడు. "నా వరె సామీ" అంటూ దగ్గరకు వచ్చాడు. నేను ఎలక్ట్రిక్ లైటు క్రీనీడలో ఉన్నాను. నా మొహం వాడికి కనపడటం లేదు. నేను కూడా వాడిని అంత పరీక్షగా చూడలేదు. నేను అరవవాడి ననుకున్న రిక్షావాడు, నాతోటి అరవం లోనే బేరమాడాడు. కాని వచ్చీరాని అరవంలో తెలుగుదనం స్పష్టంగా కనిపిస్తోంది. వాడి గొంతుక కూడా యెక్కడో, యెప్పుడో విన్న ట్టనిపించింది కాని, అది స్ఫురణకి తెచ్చుకొనేంత తెలివిలో లేను నేను. శాంత నాతోటి షికారు రావడమే మహాభాగ్య మనుకున్నాను. అందులో నా గదికి కూడా వస్తానంది. నా జన్మ పవిత్రమైన దనుకున్నాను. నాలు గణాలకు బాడుగ కుదుర్చుకొని యిద్దరమూ యెక్కాము రిక్షా. లాక్కొని పోతున్నాడు. దారిపొడుగునా నేనూ, శాంతా అనేక విషయాలు మాట్లాడుకున్నాము. మాలాంటి మానవుడే, ఒక పావులా డబ్బుల కోసం మమ్మల్ని యిద్దర్నీ మోస్తున్నాడే అన్నమాట మా మనసుకి తోచలేదు.

నా గది దగ్గరికి వెళ్ళడంతోటే, లక్ష ఆలోచనలతోటి నేనూ, శాంతా చెంగున దూకాం రిక్షాలోంచి. పావలా తీసి వాడిచేతులో పెట్టాను. దీపపు వెలుతురులో తేరిపార చూశాడు రిక్షావాడు.

"బాబుః! మీతో కొంచెం మాటాడా లండి."

నాకు ఆశ్చర్య మేసింది. ఇది ప్రథమం తెలుగులో వాడి మాట నేను వినడం. వాడితో మాటలు పెట్టుకూర్చుంటే, నా శాంతకి కష్టంగాదూ!

"ఇప్పుడు కాదు" అన్నాను.

"బాబుగారు నన్ను మరచిపోయేరండి!"

"అఁ—నాకు—సరిగా—జ్ఞాపకం—"

"నేను రామయ్యనండి. ఏడాది వరకు తమ పొలం పాలికి చేసిన వాడిని."

"ఆఁ. ఏమిటి, రామయ్యావా నువ్వు! ఏం యిలాగా?"

"తమరి పనేనండి. ఆలోశనా పాలోశనా లేకుండా తమరు చేసిన అన్యాయం, నా కడుపు గొట్టేసిందండి. నా పెళ్ళాం బిడ్డలు అల్లాడిపోతున్నారు. ఎంతో బతిమాలినా, దయబుట్టింది కాదు బాబు గారికి—"

"ఏమిటి—రామయ్యా? నా కర్థం కాలేదు."

"ఏ ముందండి? పది తరాల్నుంచీ, మీ పొలాలు మేం చెయ్యటం, మాకు సరిపడ్డ గింజ ఉంచుకొని, మక్తాప్రకారం మీ ధాన్యం మీ కప్ప చెప్పడం....తమరు కుఱ్రతనంలో ఉన్నారు. నాయనగారు పోయాక పెత్తనమంతా మీ చేతిలోకి వచ్చేసింది. సెప్పుడుమాట విని నా నోటి మీద గొట్టేశారు."

"ఆఁ..................."

"నా దగ్గర దమ్మిడీ నిలవలేదు బాబయ్యా అంటే యిన్నారు కారు. నమ్మకం మీద రసీదులేకుండా మీ నాయనగారికి మూడొందలు యిచ్చానంటే నమ్మారు కారు. నా పెళ్ళాం బిడ్డలు కూడులేకుండా మాడి సస్తారంటే ఆలోచించారు కారు. కానీండి నా రాత. ఆర్నెల్లయింది ఈ వూరికి వచ్చి. ఏ వృత్తీ దొరక్క యీ పని సేస్తుండాను. నా పనయిపోయింది. ముగ్గురి పిల్లలతోటి యీ వూరు వచ్చాను. ఇద్దర్ని దేము డెత్తుకొనిపోయినాడు, బతికున్నవాడు కూడా ఇప్పుడో కాస్సేపో అన్నట్టుండాడు. నా పెళ్ళాం మంచంపట్టి వారంరోజు లయింది. నాకు రెండో దిక్కు లేదు"

ప్రక్కన శాంతవున్న సంగతి మరచిపోయాను. నా కళ్ళు నీళ్ళు తెచ్చుకున్నాయి. కౌలురేటు పెంచియిస్తామని వచ్చిన సుబ్బారెడ్డికి నా పొలం మక్తా కిచ్చేశాను. అంతరేటూ యిమ్మని రామయ్యని చాలా యిబ్బంది పెట్టాను. యివ్వలేనన్న కారణం చేత రామయ్యని వదులుకో మన్నాను. అదే యింత పని చేసిం దని నాకు తెలియదు.

రామయ్య చెపుతూనే ఉన్నాడు. శాంత కూడా వింటోంది.

"బాబూ, యీ రిక్షా రోజుకి ఆరణాల అద్దెకు తీసుకున్నాను. ఏ రోజు అద్దె ఆ రోజు యిచ్చెయ్యవలసిందే, అద్దెపోగా అర్థరూపాయి,

పదణాలు మిగుల్తాయి. అందులో పాపలా కల్లుకి. కల్లు త్రాగకపోతే మర్నాడు బండి లాగలేను. బండి లాగకపోతే యీ మాత్రం తిండి కూడా దొరకదు .........త్రాగుతున్నాను. సంపాదించిన దాంట్లో సగం డబ్బులు త్రాగుడికి పోస్తున్నాను. మిగిలిన డబ్బుతో పొట్ట గడుపు కుంటాము. ఓ చెట్టు క్రింద కాచుకు తాగుతాము. ఎండకీ, వానకీ మా కదే ఆశ్రయం. బాబూ, యిది నా కథ."

ఏడుపు పొర్లి వచ్చింది నాకు. ఎంత అమానుషంగా ప్రవర్తిం చానూ! హాయిగా బ్రతికే కుటుంబాన్ని, స్వల్ప లాభంకోసం అగచాట్ల పాలు చేసేశాను. ఛీ! తరతరాల్నించీ వీళ్ళ కష్టాన్ని ఆధారం చేసుకొని బ్రతికి, చివరకి వీడి భార్యాబిడ్డలు రోగంతో ఛస్తూ వుండగా, నా ప్రియు రాలితో నేను సల్లాపాలు పలుకుతో వీడిచేత రిక్షా లాగించుకున్నాను. ఈ వుసురు తగలదూ! నన్ను నిలువునా దహించి వెయ్యదూ! ఏం చెయ్యనూ? ఇలా ఆలోచనలో పడిపోయాను.

"రామయ్యా! పద, నేను కూడా వస్తాను, నీ భార్యాబిడ్డ లున్న చోటికి. డాక్టరును తీసికొచ్చి చూపిద్దాం. మారు చెప్పకు. పద, నడిచే వస్తాను నీతోటి" అని రామయ్య దారితీయగా వెనకాలే నడిచి వెళ్ళాను. శాంతని వాళ్ళ గదికి వెళ్ళి పొమ్మన్నాను. పైక్రాస్టురోడ్డు దగ్గరికి వెళ్ళాం మాట్లాడకుండా. ముందు రామయ్యా, వెనకాల నేనూ వెళ్ళాము. ఒక గంగరావి చెట్టు క్రిందకి నన్ను తీసికెళ్ళాడు. చిరుగుల చాప మీద తన ప్రక్కన పరుండ బెట్టిన బిడ్డ మీద చెయ్యివేసి పడివుంది వాడి భార్య. రామయ్య భార్యను లేపాడు. ఆమె లేస్తూనే ఏడుపు ఆరం భించింది. ఆ వొక్క బిడ్డ కూడా ఒక గంట క్రింద చనిపోయాడు. ఆ యిల్లాలి యేడుపు నా పేగుల్ని చుట్ట చుట్టి వేసింది. నాకేమీ తోచ లేదు. రామయ్య యేడవలేదు. పరిస్థితులు వాని మనస్సును మార్చి వేశాయి కామోసు! రెండు మాసాలలో చనిపోయిన యిరువురి బిడ్డల కోసమేడ్చి, సాటి రిక్షావాండ్ల అంతులేని కష్టాల్ని చూసి, వాడి కళ్ళల్లో నీళ్ళు యెండిపోయాయేమో!

రామయ్య భార్య యేడ్పుతోటే ప్రక్కనున్న రిక్షావాండ్లు కుటుం బాలతో సహా వచ్చి, సానుభూతి తెలియజేస్తూ, చనిపోయిన బిడ్డను

పూడ్చటానికి తీసుకుపోయారు. నేను త్వరగా, సమీపంలోవున్న డాక్టరును తీసికొచ్చి రామయ్యా భార్యని పరీక్ష చేయించాను. డాక్టరు "ఐ యామ్ సారీ. దీనికి టెటనస్. చాలా సీరియస్‌గా ఉంది. జనరల్ హాస్పిటలులో చేరిస్తే ఏమయినా లాభ ముండవచ్చును" అని వెళ్ళి పోయాడు. టాక్సీ కోసం ఫోనుచేసి, అందులో ఆమె నెక్కించుకొని హాస్పిటలుకి తీసికెళ్ళి, అతికష్టం మీద అడ్మిట్ చేయించి, అవసర ఖర్చుకి వుంచుకోమని రామయ్యాకి అయిదు రూపాయ లిచ్చి నా గదికి వచ్చాను.

రాత్రంతా నిద్రపట్టలేదు. మరునాడు ప్రొద్దున్నే హాస్పిటలుకు వెళ్ళాను.

ఆమె రాత్రి ఒంటిగంటకు పెరాలిటిక్ ఫిట్ వచ్చి చచ్చిపోయిం దట. రామయ్యా నాకు కనపడలేదు—అప్పటికీ—ఇప్పటికీ—

భగవంతుడు క్షమిస్తాడా నన్ను?

———

# 22. కోనేటి నిజం

ఆమె కొత్తగా కాపురానికి వచ్చింది. కథలలోను, నవలలలోనూ చదివి, కాపురం అంటే మధురాతి మధురంగా ఉంటుం దనుకుంది.

అత్తగారు ఆదరిస్తా రనుకున్నది. ఆడుబిడ్డలు పరిహాసా లాడుతూ, నవ్వుతూ సుఖపెడతారనుకున్నది. భర్త తనకు అరచేతిలో స్వర్గాన్ని చూపెడతాడని సుఖస్వప్నాలు కన్నది.

* * *

అతడు కష్టపడి చదివాడు. గొప్ప మెప్పుతో పరీక్ష ప్యాసయినాడు. మంచి ఉద్యోగం దొరుకుతుం దనుకున్నాడు. మెళ్ళో పుస్తెలను కూడా